క్లుప్తంగా

కంప్యూటర్, ప్రింటర్ విరాళం



పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ అందజేస్తున్న బ్యాంకు బీఓఎం, డైరెక్టర్లు

ఆదోని అర్బన్: పట్టణంలోని శ్రీ మహాయోగి లక్ష్మమ్మ కో ఆపరేటివ్ బ్యాంకు తరఫున రూ.60 వేలు విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్‌ను కడితోట గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలకు బ్యాంకు బీఓఎం చైర్మన్ రాయచోటి సుబ్బయ్య, వైస్ చైర్మన్ బి.లక్ష్మీనారాయణశెట్టి చేతులమీదుగా అందించారు. వారు మాట్లాడుతూ తమ బ్యాంకు తరఫున పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు సురేష్‌గుప్త, విరుపాక్షిరెడ్డి, హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని శనివారం పీఆర్ ఏఈ జయన్న పరిశీలించారు. జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాతో పాటు సాంఘిక సంక్షేమ శాఖ డీపీఆర్ భవన నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించడంతో స్థలాన్ని పరిశీలించినట్లు ఆయన తెలిపారు. రూ.50లక్షలతో భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు వెల్లడించారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం, భవన సాధన కమిటీ నాయకులు ఆదెన్న, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

మంత్రాలయం రూరల్ : శ్రీ మఠం సుజయింద్ర ఆరోగ్య వైద్యశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ఆరోగ్యశాలలో శ్రీ కరిబసవేశ్వర చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నాగేష్‌బాబు ఆధ్వర్యంలో డాక్టర్ మధన్ జోషి నేతృత్వంలో రెండు రోజుల పాటు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మొదటి రోజు శనివారం 128 మంది పాఠశాల విద్యార్థులు, మఠం సిబ్బందికి కంటి పరీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రంగానథ్, సోమేశ్వర్, ఆసుపత్రి కోఆర్డినేటర్ విజేంద్రరావు, శ్రీమఠం డాక్టర్లు పాల్గొన్నారు.

ఆలయాల్లో పూజలు

కౌతాళం: మండలంలోని అంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి పూజలు చేపట్టారు. కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు అంజినేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

లోకకళ్యాణార్థం యజ్ఞం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని గీతా మందిరంలో ఈనెల 13వ తేదీ నుంచి నుండి లోకకళ్యాణంకై నిర్వహించిన గీతా జ్ఞాన యజ్ఞం శనివారం ముగిసింది. గీతా మందిర ప్రధాన అర్చకులు విష్ణువర్ధన్ శర్మ వేదమంత్రోచ్ఛరణతో కామవరం గురు శివరామ అవధూత ఆశ్రమ అధ్యక్షుడు శ్రీ అవ్యకానంద సరస్వతి స్వాముల వారిని గీతా మందిర సేవా సమితి సభ్యులు ఎం.నాగరాజు, కేఎస్పీ శివన్న, ఉరుకుందప్ప, చెన్నారెడ్డి, ఎం.లక్ష్మన్న, హంపయ్య, రఘురామ్, శ్రీనివాసులు, ఈరన్న, నాగేశప్ప సత్కరించారు.

సీసీ రోడ్డు నిర్మించాలి

నందవరం : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలనికి వెళ్లే దారిలో మురుగు నీరు, వర్షపు నీరు నిలిచిందని, తొలగించి సీసీ రోడ్డు నిర్మించాలని పీడీయూ జిల్లా కార్యదర్శి సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగన్న డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పీహెచ్‌సీ కేంద్రం ఎదుట ఆ సంఘాల నాయకులు వినూత్న రీతిలో రోడ్డుపై నిలిచిన నీటిలో మొక్కలు నాటుతూ నిరసన తెలిపారు.

కష్టంతో మంచి ఫలితాలు



లక్ష్మన్నను అభినందిస్తున్న ప్రదీప్‌కుమార్‌రెడ్డి

మంత్రాలయం రూరల్ : కష్టపడితే చదితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని వగరూరు గ్రామానికి చెందిన మాల్యల లక్ష్మన్న డీఎస్సీలో సాంఘిక శాస్త్రంలో 52వ ర్యాంకు రావడంతో స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. శనివారం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి స్వగృహంలో ప్రదీప్‌కుమార్‌రెడ్డి లక్ష్మనను పుష్పగుచ్ఛంతో అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, లింగారెడ్డి, రంగన్న, కోలేమబాషా తదితరులు పాల్గొన్నారు.

మహా గణపతికి పూజలు

కోసిగి: కోసిగిలో కొలువుతీరిన మహా గణపతులకు శనివారం నాల్గవ రోజున భక్తిశ్రద్ధలతో విశేష పూజలు చేపట్టారు. వైఎస్సార్ సర్కిల్‌లో వైఎస్సార్ సీపీ మహిళ నాయకురాలు, మాజీ జెడ్పీటీసీ దళవాయి మంగమ్మ, జగదీష్ స్వామి విశేషపూజ చేపట్టారు. శ్రీరామ నగర్ కాలనీలో భారీ గణనాథుడి వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆయా గణపతి మండపాలలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. నేడు కోసిగిలోని పలు ప్రాంతాల్లో కొలువైన గణనాథుల నిమజ్జన కార్యక్రమం చేపట్టనున్నారు.

పాసింగ్ తెచ్చిన తంటా !

- ఆదోని యార్డులో పాసింగ్ వ్యవస్థ రద్దు చేస్తున్నట్లు సెక్రటరీ ప్రకటన
- వేరుశనగ వ్యాపారులు, హమాలీల మధ్య కుదరని సయోధ్య
- నిలిచిపోయిన కొనుగోళ్లు
- నష్టపోతున్న రైతులు, కమీషన్ ఏజెంట్లు



యార్డులో పేరుకుపోయిన వేరుశనగ దిగుబడులు

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో గత వారం రోజులుగా పాసింగ్ వ్యవస్థపై గందరగోళ పరిస్థితి నెలకొంది. వ్యాపారులు, హమాలీల మధ్య నెలకొన్న సమస్య వల్ల యార్డుకు తెచ్చిన వేరుశనగకాయల దిగుబడులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో మూడు నెలలపాటు రాత్రనక, పగలనక, వర్షమనక కష్టపడి పంట పండించిన రైతులకు, పంట కోసం వారికి సాయం అందించిన యార్డు కమీషన్ ఏజెంట్లు నష్టపోతున్నారు.

మాట మార్చిన హమాలీలు..

ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో యార్డు సెక్రటరీ కల్పన ఇక నుంచి యార్డులో పాసింగ్ (గ్రేడింగ్) వ్యవస్థను ఈ నెల 25 నుంచి రద్దు చేస్తున్నట్లు గత వారం ప్రకటించారు. అయితే సోమవారం వ్యాపారులు రైతులు తెచ్చిన దిగుబడులకు టెండర్ వేసి ఎంట్రీ చేయకుండా వదిలేశారు. సాయంత్రం వరకు టెండర్ ప్రకటన రాలేకపోవడంతో రైతులు పెద్ద ఎత్తున కార్యాలయాన్ని ముట్టడించారు. వెంటనే సబ్‌కలెక్టర్, వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ జోక్యం చేసుకుని వ్యాపారులతో చర్చించి రైతులను ఇబ్బంది పెట్టకుండా వారిని పంపించేలా చేయాలని సూచించారు. అయితే వేరుశనగ దిగుబడులను డబ్బాలతో కాకుండా ఎమ్మిగనూరు యార్డు తరహాలో హమాలీలు చాటతో ఎత్తి సంచుల్లో నింపితే తమకు అభ్యంతరం లేదని వ్యాపారులు షరతు విధించారు. చాటతో ఎత్తేందుకు హమాలీలు కూడా ఒప్పుకున్నారు. దీంతో పాసింగ్ రద్దు అయ్యి యథావిధిగా వేరుశనగ మార్కెట్ ప్రారంభమయ్యింది. కాగా, అదేరోజున హమాలీలు మరలా ఎదురు తిరిగారు. సమస్య పరిష్కారమవుతుందన్న ఉద్దేశంతోనే కొందరు హమాలీలు ఒప్పుకున్నారని.. తాము డబ్బాలతోనే ఎత్తుతామని మాట మార్చడంతో సమస్య మొదటికి వచ్చింది. దీంతో కొనుగోళ్లు నిలిచిపోయాయి.

5 వేల మందికి ఇబ్బంది

ఆదోని మార్కెట్‌యార్డులో రోజుకు 10 వేల నుంచి 25 వేల వరకు వేరుశనగకాయల దిగుబడులను రైతులు అమ్మకానికి తీసుకొస్తారు. యార్డుపై ఆధారపడి 3 వేల మంది హమాలీలు, 500 మంది కూలీలు, 500 మంది కమీషన్ ఏజెంట్లు, 1000 మంది గుమస్తాలు, 500 మంది బండివాళ్లు, ఆటోవాలాలు జీవనం సాగిస్తున్నారు. కొనుగోళ్లు నిలిచిపోవడంతో వీరందరూ తీవ్రంగా నష్టపోవడమేగాకుండా గత వారం రోజుల నుంచి ఆదాయం లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యార్డుకు భారీగా తగ్గిన ఆదాయం

ఆదోని మార్కెట్‌యార్డుకు గత వారం రోజుల నుంచి పాసింగ్ వ్యవస్థ ఉండడం వల్ల వ్యవస్థ గందరగోళంగా ఉండడంతో సెస్ రూపంలో యార్డుకు ఆదాయం తగ్గుముఖం పట్టింది. రోజుకు 10 వేల నుంచి 20 వేల సంచుల దిగుబడులను రైతులు అమ్మకానికి తీసుకొస్తున్నారు. ప్రస్తుతం పరిస్థితుల్లో దిగుబడులన్నీ ఎమ్మిగనూరుకు తరలుతున్నాయి. రోజూ ఎమ్మిగనూరులో 10 వేల సంచులు వేస్తున్నట్లు ఏజెంట్లు చెబుతున్నారు.

కమీషన్ ఏజెంట్లకు నష్టం..

ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులోని కమీషన్ ఏజెంట్లు రైతులకు పంట కోసం రూ.లక్షల్లో సాయం చేస్తున్నారు. ఇలాంటి గందరగోళ పరిస్థితుల్లో దిగుబడులను రైతులు ఆదోని యార్డుకు తీసుకురాకుండా ఎమ్మిగనూరుకు తరలిస్తుండడంతో రైతులకు లక్షల్లో ఇచ్చిన సాయం నష్టపోతున్నామని ఏజెంట్లు వాపోతున్నారు. బంగారం, ఇళ్లు, ప్లాట్లను బ్యాంకులో తాకట్టు పెట్టి రైతులకు పెట్టుబడి పెట్టామని, ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

పాసింగ్ వ్యవస్థ ఇలా...

ఆదోని మార్కెట్‌యార్డులో రైతులు ఉదయం తెచ్చిన వేరుశనగకాయల దిగుబడులను ఎండకు ఆరబోస్తారు. వ్యాపారులు వారికి కావాల్సిన గిట్టుబాటు ధర వేసిన వెంటనే ఇనాంలో ఎంటర్ చేసి, ధర ప్రకటన వచ్చిన తర్వాత దుకాణానికి వెళ్లి వేరుశనగకాయలను పాసింగ్ (గ్రేడింగ్) చేస్తారు. అంటే రాళ్లు, రప్పలు, మట్టి, వీటన్నింటినీ శుభ్రపరుస్తారు. అంతేగాకుండా ఖాళీ సంచులను సాయంత్రం 4 గంటలకు ఇస్తే హమాలీలు డబ్బాతో నింపి పెడతారు. అదే ఎమ్మిగనూరులో అయితే ధర ప్రకటన వచ్చిన వెంటనే పాసింగ్ (గ్రేడింగ్) చేయకుండా వ్యాపారులు ఖాళీ సంచులు ఇస్తే హమాలీలు, కూలీలు వేరుశనగకాయలను చేటతో నింపుతారు. ఇలా నింపడం వల్ల మట్టి సంచుల్లో రాదని, డబ్బాతో అయితే మట్టి మొత్తం సంచుల్లో వస్తుందని కొంతమంది వ్యాపారులు చెబుతున్నారు. ఎమ్మిగనూరు యార్డులో పాసింగ్ లేకపోవడంతో ధర దాదాపు రూ.700 నుంచి రూ.1000 వరకు తక్కువగా ఉంటుందని, ఆదోనిలో పాసింగ్ వ్యవస్థ ఉండడంతో ధర అధికంగా పలుకుతోందని పేర్కొంటున్నారు.

సమస్యను పరిష్కరించేందుకు ఉన్నతాధికారుల చర్యలు

ఉన్నతాధికారులు సోమవారం రోజుయార్డుకు వచ్చి పాసింగ్ పద్ధతిపై వ్యాపారులు, హమాలీలతో చర్చించి నిర్ణయం తీసుకుంటారు. తాము ప్రకటన ఇచ్చే వరకూ రైతులు యార్డుకు దిగుబడులు తీసుకురావొద్దు.

– శాంతకుమార్, యార్డు అసిస్టెంట్ సెక్రటరీ

జిల్లాకు దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలి



ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్‌కు వినతి పత్రం ఇస్తున్న జిల్లా సాధన సమితి నాయకులు

ఆదోని సెంట్రల్: కర్నూలు జిల్లాకు దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని దామోదరం జిల్లా సాధన సమితి ప్రధాన కార్యదర్శి దాసరి రామశేషయ్య కోరారు. ఈ మేరకు శనివారం ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు డి. మధుసూదన్, బిటి. నాయుడులను కలసి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య భారతంలో అవినీతి మరకలు లేని నాయకుడు ఎవరైనా ఉన్నారు అంటే అది దామోదరం సంజీవయ్యని అన్నారు. జిల్లాకు పేరు పెట్టాలని 40 సంవత్సరాలుగా పోరాటాలు చేస్తున్నా పాలకులు పట్టించుకోక పోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో దామోదరం జిల్లా సాధన సమితి నాయకులు దామోదరం రాధాకృష్ణ మూర్తి, నాగభూషణం, పెరికల రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయించండి

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీ అభివృద్ధికి, ఎస్ఎస్ ట్యాంకుల మరమ్మతులకు రూ.70 కోట్ల మేర నిధులు విడుదల చేయించాలని చైర్‌పర్సన్ లోకేశ్వరి, వైస్ చైర్మన్‌లు అబ్దుల్‌గొస్, నరసింహులు, కౌన్సిల్ సభ్యుడు సందీప్‌రెడ్డి ఎమ్మెల్సీ, మున్సిపల్ అఫీషియో సభ్యుడు బి.టి.నాయుడును కోరారు. శనివారం చైర్‌పర్సన్ సి.హెచ్.లోకేశ్వరి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఆదోని మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు కోట్లాది రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని మంజూరు చేయించాలని ఎక్స్ అఫీషియో సభ్యుడిని కోరారు. అలాగే ఆరేకల్ సమీపంలో ఆగిపోయిన మెడికల్ కళాశాల నిర్మాణం పనులు పూర్తి అయ్యేలా చూడాలని, పట్టణంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం ఆయనకు వినతిపత్రాన్ని సమర్పించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, ఏఈలు, డీఈలు, మేనేజర్, అధికారులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ బి.టి. నాయుడుకు వినతి పత్రం అందజేస్తున్న మున్సిపల్ పాలకవర్గ సభ్యులు

మందుబాబులకు రూ.3.50లక్షలు జరిమానా

ఎమ్మిగనూరురూరల్: రెండు నెలలుగా నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 35 మందికి మెజిస్ట్రేట్ రూ. 3.50 లక్షలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ యు.ఎర్రన్న తెలిపారు. శనివారం స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ రెండు నెలలుగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 40 మందిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. వీరితో 35 మందిని కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ. 3.50 లక్షలు జరిమాన విధించినట్లు తెలిపారు. మరి కొందరని కోర్టులో హాజరుపరచాల్సి ఉందని చెప్పారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ఎమ్మిగనూరురూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న సి. బెళగల్ షాషావలి(37) కోలుకోలేక శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. సి. బెళగల్ మండలానికి చెందిన షాషావలి వారం రోజుల క్రితం ఎర్రకోటలోని తన కుమార్తె వద్దకు బైక్‌పై వస్తుండగా ఎర్రకోట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వారం రోజులుగా కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికి త్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు రూరల్ పోలీసులు శనివారం తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

145 సెక్షన్ ఉల్లంఘనపై కేసు నమోదు

పెద్దకడుబూరు : 145 సెక్షన్ ఉల్లంఘించిన 20మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో సర్వే నెంబర్ 174/1లోని దాదాపు 10ఎకరాల భూమిలో ఎవ రూ సాగు చేసుకోకుండా 2023 సంవత్సరం మే నెల నుంచి 145 సెక్షన్ ప్రొసిడింగ్స్ అమలులో ఉందన్నారు. అయినా ఆ సర్వే నెంబర్‌లో భాస్కర్‌యాదవ్, వీరేష్, సర్దార్‌పటేల్, హయాత్‌పటేల్, ఈడిగ గోపాల్ తో పాటో మరో 15 మంది తహసీల్దారు ఇచ్చిన ప్రొసిడింగ్స్‌ను ఉల్లంఘించి భూమిని సాగుచేసుకుంటున్నారన్నారు. తహసీల్దారు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాట్లు వెల్లడించారు.

ఖోఖోలో విద్యార్థినుల ప్రతిభ



గెలుపొందిన విద్యార్థినులతో హెచ్‌ఎం పరిమళ దేవి, ఉపాధ్యాయులు

కోసిగి: ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆదోని జోన్ పీడీ, పీఈటీల అసోషియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జోనల్ లెవెల్ ఖోఖో పోటీలలో కోసిగి బాలికల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనపరిచారు. శనివారం పాఠశాల ఆవరణంలో పాఠశాల హెచ్‌ఎం పరిమళ దేవి, ఉపాధ్యాయ బృందం ఖోఖోలో సత్తాచాటిన విద్యార్థినులకు అభినందించారు. ఆమె మాట్లాడుతూ ఆదోని జోనల్ లెవెల్ 20 పాఠశాలలు ఖోఖో పోటీలలో పాల్గొనగా కోసిగి బాలికల పాఠశాల విద్యార్థినులు ఉరుకుందమ్మ, అంజలి, అంకితలు ప్రతిభ కనపరచి మూడవ బహుమతి సాధించారన్నారు. వారిని తీర్చిదిద్దిన పీడీ ఖలీల్ అహ్మద్‌ను ఉపాధ్యాయులు, క్రీడాకారులు అభినందించారు.



ప్రాజెక్టు నీటిలో తెలియదుతున్న విగ్రహాలు

భక్తులారా.. ఇదేమి నిమజ్జనం!

గణేశ్ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు దాదాపు మూడు నెలలుగా ఎదురు చూశారు. చందాలు వేసుకుని.. మండపాలు ఏర్పాటు చేసుకుని.. భారీ ప్రతిమలను ప్రతిష్ఠించారు. మూడు రోజులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసిన భక్తజనం గణనాథుడి నిమజ్జనం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. గోనెగండ్ల, చుట్టు పక్కల గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన విగ్రహాలను శుక్రవారం గాజులదిన్నె ప్రాజెక్టులో నిమజ్జనం చేశారు. అయితే ప్రాజెక్ట్‌లో నీరు పుష్కలంగా ఉన్నా అధికారుల నిర్లక్ష్యం.. భక్తుల అలసత్వం వెరిసి గణనాథులు నీటిపై తేలియాడుతూ కనిపిస్తున్నాయి. రాత్రి పది గంటల సమయంలో కొన్ని విగ్రహాలను నిమజ్జనం చేశారు. అయితే అక్కడ ఎటువంటి ఏర్పాట్లు చేయకపోవడం, రాత్రి వేళ రిజర్వాయర్ లోపలికి వెళ్లలేక సమీపంలోనే నిమజ్జనం చేశారు. దీంతో విగ్రహాలు పూర్తిగా నీట మునగక తేలియాడుతూ కనిపిస్తున్నాయి. భారీ విగ్రహాలు కావడంతో పూర్తిగా నిమజ్జనం అయ్యేందుకు వారం, పది రోజులు పట్టే అవకాశం ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

– గోనెగండ్ల

వైఎస్సార్‌సీపీ నాయకుడికి పరామర్శ



వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రహ్లాదరెడ్డిని పరామర్శిస్తున్న బుట్టా రేణుక, బుట్టా ప్రతూల్

నందవరం : మండల పరిధిలోని గంగవరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రహ్లాదరెడ్డి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడేవాడు. కర్నూలు ఆసుపత్రిలో చిక్సిత పొంది ఇంటికి తిరిగి వచ్చారు. విషయం తెలుసున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు నియోజకర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, పార్టీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్, మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్ శనివారం ప్రహ్లాదరెడ్డిని పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరుపాక్షిరెడ్డి, గ్రామ సర్పంచ్ బైటిగేరి శివన్న, ఎంపీటీసీ విజయమోహన్‌రెడ్డి, నియోజకవర్గ రైతు విభాగపు అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ కన్వీనర్ దొరబాబుకు పరామర్శ

గోనెగండ్ల: వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ దొరబాబు నాయుడు తల్లి బోయ నాగమ్మ అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, పార్టీ సీనియర్ నాయకుడు బుట్టా శివ నీలకంఠతో పాటు పార్టీ నాయకులతో కలిసి శనివారం సాయంత్రం గోనెగండ్లలోని కిందిగేరిలోని దొరబాబు ఇంటి కి వెళ్లి బోయ నాగమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దొరబాబుతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కాశీవిశ్వనాథ్ రెడ్డి, ఎస్‌బీ మన్సూర్, భాస్కర్ రెడ్డి, నాయుడు, ఖాజాపటేల్, రఘు, గంగాధర్, సయ్యద్ చాంద్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి భారీ బందోబస్తు



పోలీసు అధికారులతో చర్చిస్తున్న ఏఎస్పీ

ఆదోని అర్బన్: ఆదివారం జరిగే గణేష్ నిమజ్జనానికి భారీ పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఏఎస్పీ హుసేన్‌పీరా తెలిపారు. శనివారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐలు, ఎస్ఐలు పోలీసులు, డీఎస్పీ హేమలతో కలిసి జిల్లా ఏఎస్పీ హుసేన్‌పీరా చర్చించారు. దాదాపు వెయ్యి మంది డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసు సిబ్బంది, ఫోర్స్, పెట్రోలింగ్ వారితో బందోబస్తు నిర్వహిస్తామన్నారు. నిమజ్జనం రోజున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండప నిర్వాహకులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులకు సహకరించాలన్నారు.



డ్రాయింగ్ మాస్టర్ మల్లికార్జున గీసిన చిత్రాలు

అబ్బుర పరిచిన తండ్రి, కుమార్తెలు



తండ్రి, కుమార్తెలను సన్మానించిన వీహెచ్‌పీ నాయకులు

ఆదోని అర్బన్: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన డ్రాయింగ్ మాస్టర్ మల్లికార్జున గీసిన చిత్రాలు, ఆయన కుమార్తెల భగవద్గీత శ్లోకాల పఠనం అబ్బురపరిచాయి. శనివారం విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బసవన్నగౌడ్ ఆధ్వర్యంలో మల్లికార్జున గీచిన చిత్రాలను ప్రదర్శించారు. కమ్మరచేడులో పనిచేస్తున్న డ్రాయింగ్ మాస్టర్ మల్లికార్జున రూ.50 నోటుపై అయోధ్య రాముడి చిత్రం, చిన్న అగ్గిపెట్టెపై ఆపరేషన్ సింధూర్, విఘ్నేశ్వరుడు ఆర్మీ డ్రెస్‌లో గన్ పట్టుకుని కాపాడిన ఘటన, చిన్న గవ్వపై గణేశుడు శివలింగానికి అభిషేకం చేస్తున్న చిత్రాలను ప్రదర్శించారు. అదేవిధంగా ఆయన కుమార్తెలు ఏడేళ్ల నిత్యశ్రీ, ఆరేళ్ల నవ్యశ్రీ భగవద్గీత శ్లోకాలను పఠించి అబ్బుపరిచారు. అనంతరం తండ్రి, కుమార్తెలను అభినందించి శాలువాలతో సన్మానించారు.కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి, చెన్నబసప్ప, భీమ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు



మంత్రాలయంలో పదవీరమణ పొందిన హెచ్‌ఎం హంపయ్యకు వీడ్కోలు పలుకుతున్న విద్యార్థినులు

మంత్రాలయం రూరల్ : ఉత్తమ సేవలతో మంచి గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ-1 మొయినుద్దీన్, ఎంఈఓ-2 రాఘన్నలు అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవరణలో పదవీరమణ పొందిన హెచ్‌ఎం హంపయ్య దంపతులను ఎంఈఓలు, ఉపాధ్యాయులు శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అలాగే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తూ స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన సీనియర్ అసిస్టెంట్ నూర్ మహమ్మద్ ను తహసీల్దార్ రమాదేవి నేతృత్వంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది సన్మానించారు.

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపాలిటీలో వర్క్‌ఇన్స్‌పెక్టర్‌గా పని చేస్తున్న న్యామతుల్లా పదవీ విరమణ పొందడంతో శనివారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ గంగిరెడ్డితో పాటు మున్సిపల్ పలు విభాగాల అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు శాలువాలు, పూలమాలతో సత్కరించారు.

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో పనిచేసే నాజరెత్ ఉద్యోగి వలి పదవీ విరమణ పొందడంతో శనివారం కోర్టులో ఆదోని జిల్లా కోర్టు రెండవ అడిషనల్ జడ్జి సుధ, సబ్ జడ్జి యోగా నారాయణ, స్థానిక కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి జోష్ణలు శాలువా, పూలమాలతో సత్కరించారు.

డాక్టర్ మాధవిలత సేవలు ఎనలేనివి

ఆదోని అర్బన్: స్త్రీ, చిన్నపిల్లల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవిలత సేవలు ఎనలేనివని డీసీహెచ్ జఫ్రుల్లా అన్నారు. శనివారం ఎంసీహెచ్ కేంద్రంలో సూపరింటెండెంట్‌గా పదవీ విరమణ పొందిన డాక్టర్ మాధవిలత సన్మాన సభ జరిగింది. డాక్టర్లు మమత, కీర్తిప్రియ, మధుసూదన్‌రెడ్డి, బాలాజీ, అరుణ, భాగ్యలక్ష్మి, లక్ష్మి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ అసిస్టెంట్ నూర్ మహమ్మద్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్ రమాదేవి



మున్సిపల్ వర్క్ఇన్స్‌పెక్టర్ న్యామతుల్లాను సత్కరిస్తున్న కమిషనర్ గంగిరెడ్డి



ఎమ్మిగనూరులో పదవీ విరమణ పొందిన కోర్టు ఉద్యోగిని సత్కరిస్తున్న జడ్జిలు



డాక్టర్ మాధవిలతను సన్మానిస్తున్న దృశ్యం

చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: పట్టణంలోని క్రాంతినగర్‌లో నివాసముంటున్న దళిత బాలిక పట్ల అదే కాలనీకి చెందిన కురువ అరవింద్ అసభ్యకరంగా ప్రవర్తించి అవమానించాడని, అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ, రైతు కూలీ సంఘం నాయకులు ప్రసాద్ తదితరులు డిమాండ్ చేశారు. శనివారం ఆదోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

క్రీడల్లో పతకాల పంట



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు క్రీడల్లో రాణించినట్లు హెచ్‌ఎం మారుతిప్రియ తెలిపారు. శనివారం విద్యార్థులను అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆదోని జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఆదోని మున్సిపల్ హైస్కూల్ మైదానంలో నిర్వహించిన జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో తమ పాఠశాల విద్యార్థినులు బాలికల ఖోఖో విభాగంలో రజత పతకం, బాలికల కబడ్డీ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించారన్నారు. అలాగే అథ్లెటిక్స్ జావలిన్‌త్రోలో నూర్‌బాషా బంగారు పతకం, 1500 మీటర్ల పరుగు పందెంలో చాంద్‌బాషా కాంస్య పతకాన్ని గెలుచుకోవడం జరిగిందన్నారు. విద్యార్థులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు. పీఈటీలు నరసింహరాజు, రమేష్ పాల్గొన్నారు.